క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



పమిడిముక్కల: తాడంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అథ్లెటిక్స్‌లో ధనప్రియ, బోయ వెంకటలక్ష్మి, కబడ్డీలో మాధవి, విజయలక్ష్మి ఎంపికయ్యారు. హైస్కూల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో హైస్కూల్ అభివృద్ధి కమిటీ సభ్యులు యేనుగ మస్తాన్‌రావు, హెచ్‌ం ప్రసాద్ ఎంపికైన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన పీడీ రవీంద్రబాబును అభినందించారు. మస్తాన్‌రావు విద్యార్థులకు బూట్లను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వరి పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం



కురుమద్దాలి(పామర్రు): హెచ్‌ఐవీ అంటు వ్యాధి కాదని, సోకిన వారు ఏఆర్‌టీ మందులను వాడుకుని జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం సూపర్‌వైజర్ బి.రాజేష్ తెలిపారు. కురుమద్దాలి గ్రామంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో అడ్వొకసీ మీటింగ్‌ను శనివారం నిర్వహించారు. సర్పంచ్ గోట్రు విజయభారతి, గ్రామ కార్యదర్శి జీఎస్ఎస్ అంజనాదేవి, ఏఎన్‌ఎం ఎస్.నిరంజని, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది, సీఎల్ డబ్ల్యూ కె.వినయ్‌కుమార్, వలంటీర్స్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజ్యాంగం దేశాభివృద్ధికి దిక్సూచి



మండవల్లి: రాజ్యాంగం దేశాభివృద్ధికి దిక్సూచి వంటిదని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల అధ్యక్షుడు టి.అప్పారావు అన్నారు. రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని ఐక్య వేదిక మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా లోకుమూడి హైస్కూల్‌లో శనివారం రాజ్యాంగ పీఠికను విద్యార్థులతో చదివించారు. రాజ్యాంగ పీఠికను ప్రతి విద్యార్థి కంఠస్థం చేసి గుర్తుంచుకోవాలన్నారు. రాజ్యాంగమే మన ధర్మశాస్త్రం అన్న అక్షరాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. పీడీ వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

వంట పాత్రల పంపిణీ



కలిదిండి: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకం ద్వారా మండలంలోని 66 పాఠశాలలకు వంట పాత్రలను పంపిణీ చేసినట్లు ఎంఈఓ పి.ప్రభాకర్‌రావు తెలిపారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయంలో శనివారం పాఠశాలల సిబ్బందికి వంట పాత్రలను అందజేశారు. కార్యక్రమంలో కలిదిండి సర్పంచ్ మసిముక్కుల మారుతి ప్రసన్న, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

మండల సమైఖ్య సంఘ ఎన్నిక



గుడ్లవల్లేరు: స్థానిక వెలుగు కార్యాలయంలో నూతన మండల సమైఖ్య సంఘాన్ని శనివారం ఎన్నుకున్నారు. సమైఖ్య అధ్యక్షురాలిగా శాయన సత్య హారిక, ఉపాధ్యక్షురాలిగా అనగాని వెంకటలక్ష్మి, కార్యదర్శిగా కొల్లిపర లక్ష్మి, ఉప కార్యదర్శిగా కాటూరి జ్యోతి, కోశాధికారిగా గాలంకి దుర్గాభవానీని ఎన్నుకున్నట్లు ఏపీఎం ఎస్.సాంబమూర్తి తెలిపారు. నూతన కార్యవర్గానికి గ్రామైఖ్య సంఘాల వారు పుష్పగుచ్ఛాల్ని అందించి అభినందించారు. అనంతరం జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ కార్యక్రమాన్ని చేపట్టారు.

లంకపల్లికి మహర్దశ

- రూ.3.13 కోట్లతో అభివృద్ధి
- నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం
- హాజరుకానున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్, కేడీసీసీబీ ఛైర్‌పర్సన్ పద్మావతి
- అదనపు సౌకర్యాలతో గ్రామ ప్రజల్లో ఆనందం



వైఎస్సార్ హెల్త్ క్లినిక్

పమిడిముక్కల: లంకపల్లి కృష్ణా కరకట్ట వెంబడి ఉన్న మూరుమూల గ్రామం. జనాభా మూడు వేలు మాత్రమే. అటువంటి గ్రామంలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, ఎంపీ వల్లభనేని బాలశౌరి సహకారంతో గ్రామంలో నాలుగున్నరేళ్లలో రూ.3.13 కోట్లతో అభివృద్ధి జరిగింది. గ్రామమంతా సిమెంట్ రోడ్లు ఏర్పడ్డాయి. కావాల్సిన మౌలిక సదుపాయాలు సమకూరాయి. గ్రామానికి మహర్దశ పట్టింది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులివీ..

రూ.43.6 లక్షలతో సచివాలయ భవనం, రూ.23.90 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రూ.44 లక్షలతో బహుళ ప్రయోజన గోదాం, గడప గడపకు నిధులు రూ.10 లక్షలతో అప్పారావుపేట–మాలపల్లి సీసీ రోడ్డు, మరో రూ.10 లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణం, రూ.8.99 లక్షలతో పాఠశాల ప్రహరీ నిర్మాణం, నాడు–నేడు కింద రూ.12.56 లక్షలతో ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధి పనులు, లక్ష రూపాయలతో రెండు హ్యాండ్ పంపులు, జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.26.64 లక్షలతో పైపులైన్ల నిర్మాణం, ఇళ్ల స్థలాలకోసం రూ.50 లక్షలతో భూమి కొనుగోలు. రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశారు.

మంజూరైన నిధులు..

మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌కు రూ.35 లక్షలు, ఎట్టివానిగూడెంలో సీసీ రోడ్డుకు రూ.10 లక్షలు, ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద అప్పారావుపేటలో రహదారుల నిమిత్తం రూ.18 లక్షలు నిధులు మంజూరయ్యాయి.

నేడు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్, గోదాం, సిమెంట్ రోడ్లను ఆదివారం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, కేడీసీసీబీ ఛైర్‌పర్సన్ తాతినేని పద్మావతి ప్రారంభించనున్నట్లు సర్పంచ్ వేమూరి రత్నకుమారి, మొవ్వ ఏఎంసీ వైస్ ఛైర్మన్ కొడాలి రాంబాబు తెలిపారు. కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేయనున్నారని, 58.73 ఎకరాల లంక భూములకు సంబంధించి 142 మంది నిరుపేద రైతులకు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి సహకరించిన ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్, ఛైర్మన్ పద్మావతికి కృతజ్ఞతలు తెలిపారు.


లంకపల్లిలో నూతనంగా నిర్మించిన సచివాలయం


పూర్తయిన సిమెంట్ రోడ్డు


నూతనంగా నిర్మించిన గోదాం


లంకపల్లిలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా రైతు భరోసా కేంద్రం

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి

గుడ్లవల్లేరు: ప్రజా సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతుందని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. శనివారం అంగలూరు, చంద్రాలలో ఎంపీ బాలశౌరితో పాటు గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని), ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక, కేడీసీసీబీ ఛైర్‌పర్సన్ తాతినేని పద్మావతి చేతుల మీదుగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. జిల్లా పరిషత్ నిధులు రూ.10.50 లక్షలతో ఆర్‌డబ్ల్యూఎస్ నిధులతో మైక్రో వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభించారు. రూ.176.77లక్షలతో జల్‌జీవన్ పథకం పనులకు భూమిపూజ చేశారు. రూ.20 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభించారు. పీఏసీఎస్ గోడౌన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి ఉప్పాల రాము, కేడీసీసీబీ డైరెక్టర్ పడమటి సుజాత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శాయన రవి, ఎంపీపీ కొడాలి సురేష్, ఎంపీడీఓ డి.శ్రీనివాస్, తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్ సుల్తానా, పీఏసీఎస్ అధ్యక్షుడు దుగ్గిరాల శేషుబాబు, సర్పంచులు మేడేపల్లి రవికుమార్, కాలిశెట్టి అర్జునరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు నిమ్మగడ్డ కుటుంబరావు పాల్గొన్నారు.


హెల్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కొడాలి నాని, జెడ్పీ ఛైర్‌పర్సన్ హారిక

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు

ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ వెంకటరమణ

మండవల్లి: ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండలంలోని పులపర్రులో రూ.85 లక్షల వ్యయంతో నిర్మాణం జరగనున్న మంచినీటి పైపులైన్ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణతో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. గ్రామాభివృద్ధికి అంకితభావంతో ముందుకు వచ్చి పైపులైన్ పనులకు రూ.35 లక్షలు ఆర్థిక సాయం అందిస్తున్న వారికి సర్పంచ్ వేంద్ర నాగరాజు అభినందనలు తెలియజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ సైదు గాయత్రిసంతోషి, జెడ్పీటీసీ ముంగర విజయనిర్మల, రాష్ట్ర నాయకులు ముంగర నరశింహారావు, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు, ఎంపీటీసీ దారం రమేష్, వైస్ ఎంపీపీ అగస్టీ ఆదివిష్ణు, బీసీ నాయకులు చేబోయిన వీర్రాజు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు జంపన కొండరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు పూల హరిబాబు, ముంగర మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.


పైపులైన్ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ వెంకటరమణ

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు అవసరం

ఆర్డీఓ పద్మావతి

గుడివాడ టౌన్: ప్రజాస్వామ్య దేశంలో ఓటుహక్కు ఎంతో విలువైందని ఆర్డీఓ పి.పద్మావతి అన్నారు. శనివారం మున్సిపల్ , రెవెన్యూ, వార్డు సచివాలయ ఉద్యోగులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఆర్డీఓ పద్మావతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదుకావాలని, ఓటు హక్కును కూడా వినియోగించుకోవాలన్నారు. ప్రలోభాలకు లోనై ఓటు హక్కును దుర్వినియోగపరిస్తే దాని ఫలితం ప్రజలపైనే ఉంటుందన్నారు. ప్రజల్లో చైతన్యం పెంచేందుకే ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఆర్ఐ నాగబాబు, ఎలక్షన్ డీటీ లోకరాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.


గుడివాడలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్

రేపు మొవ్వలో గాత్ర కచేరీ

మొవ్వ: మొవ్వ గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ఈ నెల 27వ తేదీ సాయంత్రం కర్నాటక గాత్ర కచేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మొవ్వ తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ తెలిపారు. టూరిజం ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిసెంబర్ 10,11,12 తేదీల్లో విజయవాడలో కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, రాష్ట్రంలోని ఆరు విశిష్టమైన ప్రదేశాల్లో ముందస్తు కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 27వ తేదీన మొవ్వ ఆలయంలో సంగీత కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. విజయవాడకు చెందిన విద్వాన్ మల్లాది సూరిబాబుచే కర్నాటక గాత్ర కచేరీని, బెంగుళూరుకు చెందిన కే రమేష్, ఎస్ఆర్ వినయ్, కే దావాకర్, కే యోగిష్‌లచే పలు గాత్ర కచేరీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి. ఆలయ పూజారులకు పలు సూచనలు చేశారు.


ఆలయాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

దళిత మోర్చా బైక్ ర్యాలీ

మచిలీపట్నంటౌన్: దళిత మోర్చా ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానందం ఆధ్వర్యంలో లక్ష్మీటాకీస్ సెంటరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గుప్తా సెంటరులోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

150 మంది రోగులకు వైద్య పరీక్షలు

ఉయ్యూరు మున్సిపల్ ఛైర్మన్ వల్లభనేని సత్యన్నారాయణ

పమిడిముక్కల: ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఉయ్యూరు మన్సిపల్ ఛైర్మన్ వల్లభనేని సత్యన్నారాయణ అన్నారు. తాడంకిలో రూప ఆర్థోపెడిక్ హాస్పిటల్ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, వైద్యులు జంపాన పూర్ణిమతో కలిసి ప్రారంభించారు. సభలో వల్లభనేని మాట్లాడుతూ నాడు–నేడులో ఆసుపత్రులకు అవసరమైన సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జంపాన పూర్ణిమ మాట్లాడుతూ వైద్య రంగానికి ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తుందన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. వైద్య శిబిరంలో వైద్యులు కృష్ణ వశిష్ట, సందీప్‌లు 150 మంది రోగులకు పరీక్షలు జరిపి మందులు అందజేశారు. ఛైర్మన్ సత్యన్నారాయణ, సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్, డాక్టర్ పూర్ణిమలను ఘనంగా సత్కరించారు. పీఏసీఎస్ ఛైర్మన్ బొర్రా చినబాబు, ఉయ్యూరు పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం, బీఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు జంపాన శ్రీనివాసగౌడ్, కార్యదర్శి సునీత తదితరులు పాల్గొన్నారు.


తాడంకిలో రోగులకు మందులు అందజేస్తున్న ఛైర్మన్ సత్యన్నారాయణ

గంగానమ్మ జాతర ఏర్పాట్లపై సమీక్ష

కోసూరు(మొవ్వ): మండలంలోని కోసూరు గ్రామంలో 27వ తేదీ జరిగే గంగానమ్మ జాతరను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కూచిపూడి ఎస్ఐ డీ సందీప సూచించారు. శనివారం కోసూరు గ్రామంలో కూచిపూడి గ్రామ పెద్దలతో జాతర పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జాతరను సంప్రదాయం బద్ధంగా జరుపు కోవాలని, డీజేలను అనుమతులు లేవని, బైక్ సైలెన్సర్లు తీసి వాహనాలు నడిపి ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిపినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతరకి కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, సీసీ కెమారాలు, వీడియోలు ఏర్పాటు చేసి అల్లరి ముకలపై నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజకీయాలకు, కులాల పరంగా కాకుండా ప్రజలందరూ కలసి కట్టుగా జాతర జరుపుకోవాలని సూచించారు.

రేపు లక్ష దీపోత్సవం

మండవల్లి: మండలంలోని లోకుమూడి దత్తాశ్రమంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ దివ్య ఆశీస్సులతో లక్షదీపోత్సవం, జ్యోతిర్లింగార్చన, రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గురజాడ ఉదయ్‌శంకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం కార్తిక సమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు.

జెండర్ వివక్షపై అవగాహన

పామర్రు: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో జెండర్ వివక్షకు వ్యతిరేకంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. జాతీయస్థాయి జెండర్ ప్రచారం కోసం కార్యాచరణ ప్రణాళికలను ఈనెల 25 నుంచి 29 వరకు నిర్వహిస్తున్నట్లు డీపీఎం సుందరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాకు ప్రభావితమైన మహిళలు, పిల్లలను గుర్తించి వారి నుంచి కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. హింసకు వ్యతిరేకంగా పోరాడటానికి స్వయం సహాయక సంఘాలు, సమాఖ్యలు ముఖ్యపాత్ర పోషించాలన్నారు. ఈకార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం తిరుపతిరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు ధనాల కృపావతి, కోశాధికారి రజని, సీసీలు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మొవ్వ: బలవంతపు వివాహాలను వ్యతిరేంచాలని.. ప్రతి ఇంటిలో లింగ వివక్ష లేకుండా చూడాలని ఎంపీపీ కొండేటి ఇందిర సూచించారు. మొవ్వ గ్రామంలోని మండల మహిళ సమైఖ్య కార్యాలయంలో లింగ ఆధారిత వివక్షతపై జాతీయ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. అవగాహన కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర అధ్యక్షతన జెండర్ ప్రతిజ్ఞను చేయించారు. ఏపీఎం ప్రధానరావు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ అబ్దుల్ సలీమున్నీసా, జీఎంఎస్‌కే రేవతి, వీవోఏలు, వీవో ప్రెసిడెంట్ పాల్గొన్నారు.


పామర్రులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళలు

నేడు రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ కార్తిక వన సమారాధన

పామర్రు: మండల రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి స్థానిక యలమర్రు రోడ్డులోని ఏఎస్ఎం హైస్కూల్ ఆవరణలో సత్యనారాయణస్వామి వ్రతము, కార్తిక వన సమారాధన జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బొమ్మారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, భీమవరపు శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఎంపిక చేసిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, వృద్ధులకు గౌరవ పెన్షన్ల పంపిణీ, వస్త్ర దాన కార్యక్రమం ఉంటుందని అన్నారు. పామర్రు శ్రీ వేణుగోపాల బృందావన భజన సమాజం ఆధ్వర్యంలో శ్రీరాముల వారి భజన ఉంటుందన్నారు. తదుపరి ఉదయం 11 గంటల నుంచి అన్న సమారాధన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి బొంతు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని రెడ్డి సోదరులు విజయవంతం చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి సాయం

కైకలూరు: గీత బంధు సేవా ట్రస్టు ద్వారా బాధిత కుటుంబానికి రూ.25 వేల చెక్కును గోనెపాడు శివాలయం వద్ద రాష్ట్ర గౌడ సంఘ వైస్ ఛైర్మన్ పోసిన చెంచు రామారావు శనివారం అందించారు. ఇటీవల ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామానికి చెందిన మట్టా ఏడుకొండలు ప్రమాదవశాత్తు తాడిచెట్టు ఎక్కుతూ పడి మృతి చెందాడు. దీంతో అతని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా పోసిన రామారావు మాట్లాడుతూ గతంలో గీత బంధు సేవా ట్రస్ట్ పేరుమీద రూ.50 లక్షలు విరాళాలు సేకరించి డిపాజిట్ చేశామని, దాని ద్వారా వచ్చే వడ్డీని ఆపదలో ఉన్న గౌడ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ గౌడ సంఘ అధ్యక్షుడు పోలగాని నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లా శ్యామల రాజ్‌గౌడ్, గోనెపాడు సర్పంచ్ బత్తిన శ్రీకాంత్, దాసరి శ్రీనివాసరావు, కైకలూరు మండల అధ్యక్షుడు కట్టా నాగబాబు, కలిదిండి మండల అధ్యక్షుడు కట్టా పాండురంగారావు, దావు నాగరాజు పాల్గొన్నారు.


చెక్కు అందిస్తున్న రాష్ట్ర గౌడ సంఘ వైస్ ఛైర్మన్ పోసిన చెంచు రామారావు, నాయకులు

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

గుడివాడ టౌన్(నందివాడ): రాష్ట్ర ప్రభుత్వం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆటల పోటీల్లో నందివాడ మండలం వెన్ననపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని మద్దాల జెస్సీక తన ప్రతిభను ప్రదర్శించి పతకాన్ని సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు ఎంవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం జెస్సీకను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఈనెల 18, 19, 20 తేదీల్లో అన్నమయ్య జిల్లాలో జరిగిన అండర్–14 బాలికల కబడ్డీ పోటీల్లో కృష్ణా జిల్లా తరుపున జెస్సీకా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఆ జట్టు తృతీయ స్థానం సాధించిందని, జెస్సీకా పాత్రను గుర్తించిన నిర్వాహకులు ఉత్తమ క్రీడాకారిణి అవార్డు అందజేశారన్నారు. జెస్సీకాను, వ్యాయామ ఉపాధ్యాయుడు ఏసురత్నంను పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఎ.ఝాన్సీలక్ష్మీబాయ్, గ్రామ సర్పంచ్ అరవ బాబి, ఉపాధ్యాయులు అభినందించారు.


క్రీడాకారిణిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, తదితరులు

దరఖాస్తుల ఆహ్వానం

చల్లపల్లి: గ్రామ వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు అన్నారు. చల్లపల్లి-3 గ్రామ సచివాలయం పరిధిలో రెండు ఎస్సీ కేటగిరీ పోస్టులు, చల్లపల్లి-2 గ్రామ సచివాలయం పరిధిలో ఒక బీసీ కేటగిరీ పోస్టు, లక్ష్మీపురం గ్రామ సచివాలయం-1 పరిధిలో ఒక ఓసీ కేటగిరీ పోస్టు ఖాళీగా ఉన్నా. డిసెంబర్ ఒకటో తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ, 2న పరిశీలన, ఇంటర్వ్యూలు, 4న ఎంపిక, నియామకాలు, 5వ తేదీన శిక్షణ ఏర్పాటు చేస్తామన్నారు.

ఎన్నికల సమాచారంతో సిద్ధంగా ఉండండి

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని ఆయా నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు ఎన్నికల సమాచారంతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ పి. రాజాబాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28న జిల్లా ఎన్నికల పరిశీలకులు బి. శ్రీధర్ రానున్నారని, సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలన్నారు. 28వ తేదీ ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో జిల్లాలోని పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమవుతారన్నారు. ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎన్నికల విభాగం అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాటు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదులు, సలహాలు ఉంటే తెలియజేయవచ్చునన్నారు.